www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| సోమవారం | 02-06-2025 |




# కొత్త పథకాల్లేవు..
# ఉన్న పథకాలకు బ్రేక్..!

**కొత్త సర్కార్ ఏర్పడిన తరువాత రెండో సారి ఇది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం. ఎన్నో ఆశలు పెట్టుకుని మార్పు కోరుకున్న జనాలకు ఇంకా నిరాశే. ఎన్నో ఆశలను ఆవిరి చేస్తూ ఎప్పటికప్పుడు తప్పటడుగులతోనే సాగుతోంది రేవంత్ సర్కార్. తప్పు దిద్దుకునే పనిలో ఉంది ఇంకా. కొత్త పథకాలుంటాయని, ఇవాళ సీఎం అనౌన్స్ చేస్తాడని అనుకున్నారు చాలా మంది. నిధులు లేవు. ఖజానా ఖాళీ అని గగ్గోలు పెట్టినా.. ఇవాళ ఏదో ఒక కొత్త పథకం ఉంటుందనే ఆశలు పెట్టుకున్నా.. అక్కడ అంత సీన్ లేదని తేలిపోయింది. కొత్త పథకాలు లేవు. పాత పథకాలకు బ్రేక్. ప్రస్తుతం ఇప్పటి వరకు సర్కార్‌లో నడుస్తున్న తంతు ఇదే.**

## ఆవిర్భావ ఆశలు ఆవిరి..!

- రాజీవ్ యువ వికాస్ పథకంలో ఎమ్మెల్యేల కక్కుర్తి...!
- సగానికి మించి అనర్హులే..
- పథకం కోసం ఎగబడ్డ కాంగ్రెస్ శ్రేణులు..
- ఇందిరమ్మ ఇళ్ల పరిస్థితీ ఇదే.. !
  రైతు భరోసాలో కూడా మార్పులు చేసే యోచన..!
- ఈనెల 5న కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు..!



(దండుగుల శ్రీనివాస్)

ఈరోజు రాజీవ్ యువ వికాసం పథకం మొదటి లిస్టు లబ్దిదారుల జాబితా ప్రకటిస్తారని అనుకున్నారు. దీన్నీ బ్రేక్ వేశారు. అనర్హులంతా వచ్చి చేరారని ఏకంగా సీఎం చెప్పడం ఈ పథకం ఎంత తప్పుదోవలో నడుస్తుందో తెలుస్తోంది. ఎమ్మెల్యేల కక్కుర్తి ఈ పథకంలో బయటపడింది. దాదాపు 60 శాతం నుంచి 70శాతం వరకు అంతా అనర్హులే. పథకం పైసలు కొల్లగొట్టేందుకు అంతా రెడీ అయ్యారు. దీనిపై ఏకంగా మంత్రులు సీఎంకు ఫిర్యాదు చేసే వరకు వచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల పరిస్థితీ ఇదే. రైతు భరోసా దిక్కు లేదు. దీంట్లో కూడా సంస్కరణలు తీసుకొస్తారట. మొదట్లో భయపడ్డారు. ఇప్పుడు అనర్హులున్నారని గగ్గోలు పెడుతున్నారు. రేషన్‌కార్డు కండిషన్ పెడతారేమో బహుశ. వీటినన్నింటిపై ఈనెల 5న కేబినెట్ మీటింగు పెట్టుకుని వీటి అన్నింటిపై నిర్ణయాలు తీసుకుని ప్రకటిస్తారట. చూడాలి. ఏం చేస్తారో. రేవంత్ సర్కార్ హయాంలో వచ్చిన రాష్ట్ర ఆవతరణ ఆవిర్భావ దినోత్సవ రెండో వేడుకలు ఉసూరుమనిపించాయి. ఇంకా అంచనాలుండవు. ఆశలుండవు. అన్నట్టుగానే సాగుతోంది రేవంత్ పాలన.



## బాపు, అన్న, అక్క..! ముగ్గురూ ముగ్గురే..!

# నడవని ముచ్చట..!

## సెంటిమెంట్ ఆయింట్‌మెంట్ పనిచేయదు..!

(దండుగుల శ్రీనివాస్)

తెలంగాణ జాగృతి అని మళ్లీ కొత్త పాటందుకున్నది అక్క. బాపు పేరు చెప్పి సెంటిమెంట్ రాజేసి ఎట్లైనా సీఎం కావాలని చూస్తున్నాడు అన్న. భలే భలే మంచిగైంది. మీ తిక్క కుదరింది. నన్ను ఫామ్‌హౌజ్ కు పరిమితం చేస్తారా..? తగిన శాస్తి జరిగింది. తెలంగాణకు నేనే దిక్కు. అని మళ్లీ సెంటిమెంట్ రాజేస్తూ వ్యూహ రచనలో మునిగి వున్నాడు బాపు. అందుకే మళ్లీ తెలంగాణ జర్నలిస్టు ఫోరం .. కదం తొక్కే టైమ్ వచ్చిందని ముందుకొచ్చారు. మళ్లీ అల్లం బెల్లమయ్యాడు. కోదండరామ్‌కు వ్యతిరేకంగా ఆనాడు కేసీఆర్ పుట్టించి అటకెక్కించిన తెలంగాణ వికాస సమితి కూడా లేస్తున్నది. ఇలా అన్నింటికీ జవజీవాలందిస్తున్నారు. మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రాజేస్తున్నారు. ఈ సెంటిమెంట్ ఆయింట్‌మెంట్ పనిచేస్తదా.? అంత సీన్ లేదు. అది నడవని ముచ్చట. కానీ అంతకు మించి మార్గం లేదు. అధికారం తెచ్చిపెట్టిందదే. మళ్లీ అధికారం దిశగా తీసుకుపోతుందనే ఆశా దానితోనే. కానీ జనం సెంటిమెంట్‌ను మరిచారు. నమ్మకాన్ని వమ్ముచేసిన బాపు, అక్క, అన్నలు ఎంత ఆయింట్‌మెంట్ పూసినా ఆ గాయాలు మానేలా లేవు. వాళ్లు నమ్మేలా లేరు. అక్కడ అధికార వాటా కోసం కొట్లాట జరుగుతున్నది. ఇప్పట్నుంచే హుషార్ అవుతున్నారు. రేపు అధికారం మనదే.. అప్పుడు ఎవరిది ఎంత నడవాలె..? ఏ పొజిషన్‌లో ఎవలం ఉండాలె..? ఇప్పుడు ఆ లొల్లి ముగ్గురిలో నడుస్తున్నది. ముగ్గురూ ముగ్గురే అన్నట్టుగా సాగుతోంది. నమ్మి నానబోస్తే పుచ్చు పుర్రెలయినట్టు .. ఒకరిని మార్పు కోసం తీసుకొస్తే.. కోసినా ఏం చేయలేనంటున్నాడు. ఇంకొకరిని ఇక చాలు మీ పాలన .. అని ఫామ్‌హౌజ్ లో కూసోబెడితే.. చూశారా.. మళ్లీ మేమే యాదికొస్తున్నాం.. తప్పదు మా కాళ్లకాడికి రావాల్సిందేనని బీరాలు పలుకుతూ ఇప్పట్నుంచి అధికారాల వికేంద్రీకరణపై నజర్ పెట్టారు. మధ్యలో తెలంగాణ ప్రజలను మాత్రం వెర్రి గొర్రెలను చేస్తున్నారు. హ్యాపీ ఫార్మేషన్ డే అందరికీ.

## 5న కేబినెట్ సమావేశం

### కీలక అంశాలను చర్చించాలని నిర్ణయం



వాస్తవం, హైదరాబాద్:

ఈ నెల 5 న కేబినెట్ సమావేశం నిర్వహించి కీలక అంశాలను చర్చించాలని మంత్రుల సమావేశంలో నిర్ణయించారు. ఇవాళ ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్ర అవతరణ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వాన కాలం పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసం అంశాలపై మంత్రులు అందించిన నివేదికపై సమావేశంలో చర్చించారు. మే 29, 30 తేదీలలో జిల్లాల్లో పర్యటించిన మంత్రులు ఈ నాలుగు అంశాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించారు. అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తుది జాబితాలు, రెవిన్యూ సదస్సుల నిర్వహ ణ ఏర్పాట్లపై జిల్లాల వారీగా తయారు చేసిన నివేదికలపై సమావేశంలో వివరించారు. రాజీవ్ యువ వికాసానికి ఊహించినదానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు యువ వికాసం అందకుండా చూడాలని పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని మంత్రులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. మరింత లోతుగా విశ్లేషించి లబ్ది దారులను గుర్తించాలని నిర్ణయించాలన్నారు. ఒక్క అనర్హుడికి కూడా రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరవద్దన్నారు. ఈ అంశంపై కేబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీకి సంబంధించి అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇప్పటికే నివేదిక అందించారు. ఆ నివేదికపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు వివరించారు. దీనిపై కేబినెట్‌లో చర్చించి సమస్యల పరిష్కారంపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోనున్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మంత్రులు అభినందించారు.

## తెలంగాణ బీజేపీ నేతల కీలక నిర్ణయం

- నేటి నుంచి కార్యకర్తలకు అందుబాటులో నేతలు
- తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో..
- కార్యకర్తలకు అందుబాటులో రోజుకో ప్రజాప్రతినిధి
- ఆఫీసులో ప్రత్యేక గది కేటాయించిన కిషన్‌రెడ్డి
- నేడు కార్యకర్తలతో మాట్లాడనున్న ఈటల రాజేందర్

## ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

వాస్తవం, హైదరాబాద్:

జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం పదకొండేళ్ళు పూర్తయి పన్నెండో సంవత్సరంలో అడుగుపెడుతోంది.

ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ఏళ్లకేళ్లుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, రాజకీయ పార్టీల నాయకులందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

## 'స్లాట్'తో పెరిగిన రిజిస్ట్రేషన్లు

- రిజిస్ట్రేషన్ సేవల్లో ఏఐతో వాట్సప్ చాట్‌బాట్ మేధా
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వాస్తవం, హైదరాబాద్:

రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం తోపాటు కృత్రిమ మేధ (ఏఐ) సేవలను ఉపయోగించుకొని ప్రజలకు మరింత సులువైన సమర్ధవంతమైన సేవలను అందించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.రాష్ట్ర వ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను ఇప్పటివరకు ప్రయోగాత్మకంగా రెండు విడతల్లో 47 చోట్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలుచేయగా తాజాగా జూన్ 2వ తేదీ నుంచి మిగిలిన 97 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నాడు స్టాంప్స్.. రిజిస్ట్రేషన్ అధికారులతో మంత్రిగారు సమీక్షించారు.